క్లుప్తంగా

ఆలయ ధ్వజస్తంభానికి కవచం ఏర్పాటు



కవచం ఏర్పాటు చేయించిన దాతలు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట వేంకటేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభానికి కర్నూలుకు చెందిన మద్దిలేటి, మహాలక్ష్మి దంపతులు రూ.లక్ష నగదుతో కవచం, స్వామి అమ్మవార్లకు పల్లకీ బహూకరించారు. ఆలయ నిర్వాహకుడు మద్దయ్య, భక్తులు దాతలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ అర్చకులు

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమిలో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆలయ అర్చకుడు భాస్కరయ్య తహసీల్దార్ నారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. శివాలయానికి సర్వే నంబర్ 308లో 4 ఎకరాల భూమిలో విలువైన ముడి ఖనిజం ఉందని, కొందరు అక్రమంగా మైనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. దేవుని మాన్యాన్ని రక్షించి, అక్రమదారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని కమిటీ సభ్యులకు అందిస్తున్న దాత

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి దాతలు స్పందిస్తున్నారు. సోమవారం బందార్లపల్లెకు చెందిన కర్జం వీరారెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష విరాళం అందజేశారు. వంటశాల, డైనింగ్ హాల్, ఆలయ అభివృద్ధి కోసం ఈ విరాళాన్ని వినియోగిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి చెప్పారు. పురాతన ఆలయాన్ని ఇప్పటికే అభివృద్ధి చేస్తూ వచ్చామన్నారు. దాతల సహకారంతో మరిన్ని పనులు చేపట్టి భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చుతామని పేర్కొన్నారు. దాత వీరారెడ్డిని కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో యాతం పెద్దరామిరెడ్డి, పెద్దవెంకటరెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, బాచం నాగేశ్వరరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, రఘు, దేవేంద్రుడు, చంద్రహాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

బేతంచెర్ల: గుంటూరు జిల్లా తెనాలిలోని యూనిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో బేతంచెర్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 9 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అమృత, శ్రీవల్లి రెడ్డి, దివ్యశ్రీ, పూర్ణేంద్ర బంగారు పతకం, ప్రశాంత్ వల్లి, ఉత్తేజ్ కుమార్ సిల్వర్, యశ్వంత్, రిత్విక్ సాయి, నీల కంఠమణి తేజ రెడ్డి కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను మాస్టర్ వెంకటేష్, కోచ్ నాగన్న అభినందించారు.

ఉమామహేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఏకశిలా రూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

- పండ్లను మాగబెట్టేందుకు రసాయనాల వినియోగం
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- రైపనింగ్ ఏర్పాటుకు ఆసక్తి చూపని వ్యాపారులు
- కనిపించని అధికారుల దాడులు

మధుర ఫలాలు..

విషతుల్యం



రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లు

బనగానపల్లె రూరల్: ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ప్రస్తుతం ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో రోజువారి తీసుకునే ఆహారంలో జామ, బొప్పాయి, అరటి, దానిమ్మ, కమలపండ్లు, మామిడి తదితర పండ్లను ఎక్కువగా తీసుకుంటున్నారు. డాక్టర్లు, న్యూట్రిషిన్స్ సైతం పండ్లు, తృణధాన్యాలు తీసుకోవాలంటూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. శాఖాహారులు ఆరోగ్యం కోసం పండ్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే తాము తీసుకునే పండ్లు ఆరోగ్యకరమైనవా, కాదా అన్న ప్రశ్న వినియోగదారులను వేధిస్తోంది. బనగానపల్లె పట్టణంలో మామిడి, అరటి, జామ, దానిమ్మ పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే మార్కెట్‌లో పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్ తదతర రసాయనాలను దళారులు వినియోగిస్తుండడంతో ఈ పండ్లు విషతుల్యంగా మారుతున్నాయి. పోషకాలతో పాటు విషపదార్థాలు శరీరంలోకి వెళ్లడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. రసాయనాల వాడకం వల్ల కలిగే నష్టాలను వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

రసాయనాల వినియోగం ఇలా..

పండ్ల తోటల నుంచి వినియోగదారుడికి పండ్లు చేరే మధ్యలో మార్కెట్ కీలకమైంది. పండ్లు చెట్టు మీదనే మాగిన తరువాత తినడం దాదాపు సాధ్యం కాదు. పచ్చిగా ఉండగానే వాటిని ప్రకృతి సిద్ధంగా మాగబెట్టి మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంటుంది. అయితే సమయానుకూలత వల్ల దళారులు రసాయనాల వినియోగం ద్వారా పండ్లను మాగబెడుతున్నారు. మామిడి పండ్లకు కాల్షియం కార్బైడ్, అరటి పండ్లకు ఇథెఫాన్ లిక్విడ్‌లను స్ప్రే చేస్తూ పండ్లు పక్వానికి వచ్చేలా చేస్తున్నారు.

ఇలాంటి పండ్లు తినడం ప్రమాదకరం



రసాయనాలతో మాగబెట్టిన పండ్లు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. పండ్లు మాగబెట్టేందుకు క్యాల్షియం కార్బైడ్‌తో పాటు ఇతర రసాయనాలు వినియోగిస్తారు. ఇలాంటి పండ్లు తీసుకోవడం వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు వాంతులు విరేచనాలు, మెదడు సంబంధిత జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. సహజ సిద్ధంగా మాగిన పండ్లను తీసుకోవడమే ఆరోగ్యకరం.

–డాక్టర్ సుహైల్‌బాబు, మెడికల్ ఆఫీసర్, టంగుటూరు పీహెచ్‌సీ

ప్రత్యామ్నాయ మార్గాలున్నాయి



సహజసిద్ధంగా పండించిన పండ్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. కాల్షియం కార్బైడ్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. ప్రత్యామ్నాయంగా వ్యాపారులు ఎథిలిన్ హార్మోన్ గ్యాస్ స్ప్రే చేయవచ్చు. రైపనింగ్ చాంబర్లు కూడా ప్రయోజనకంగా ఉంటాయి. రసాయనాలతో మాగిస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

–రఘువరన్, ఉద్యానవనశాఖ అధికారి, బనగానపల్లె

కనిపించని అధికారుల తనిఖీలు

పండ్లను రసాయనాలతో మాగబెట్టి విక్రయాలు జరుపుతున్నా పంచాయతీ, ఉద్యానవనశాఖ, విజిలెన్స్ శాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. వ్యాపారులపై ఆకస్మిక దాడులు చేయడం వల్ల కొంత వరకైనా రసాయన మందులతో మాగబెట్టడం తగ్గుతుందన్న అభిప్రాయాన్ని వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. రసాయనాలు వినియోగించారా లేదా అనేది ఉద్యానవనశాఖ అధికారులు నిర్ధారిస్తే, సంబంధిత అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. పండ్లు విషతుల్యం కాకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన రైపనింగ్ చాంబర్లలో పండ్లను మాగబెట్టి విక్రయించడం ఎంతో మేలని అధికారులు పేర్కొంటున్నారు.

ఇలా గుర్తించవచ్చు..?

సహజసిద్ధంగా మాగిన మామిడి పండు కొంత పసుపు.. మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వత చెంది ఉంటుంది. కమ్మని సువాసన వస్తుంది. మనం కొద్ది దూరంలో ఉన్నా పండు వాసన గుప్పుమంటుంది. రసాయనాలతో మాగిన పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు రంగు కలిగి ఉంటుంది. పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటుంది. కమ్మని వాసన ముక్కు దగ్గర ఉంచినప్పుడు మాత్రమే వస్తుంది. తీపి తక్కువగా ఉంటుంది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న కమిషనర్, సిబ్బంది

డోన్ టౌన్: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ గ్రేస్ సెలష్టియల్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం యోగా శిక్షకులు సోనీ, ప్రతాప్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి యోగాసనాలపై అవగాహన కల్పిస్తూ యోగాసనాలు వేయించారు. యోగా దినోత్సవం (జూన్ 21న) పురస్కరించుకుని పక్షం రోజులు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, అధికారులకు యోగా నేర్పించనున్నట్లు గ్రేస్ సెలష్టియల్ తెలిపారు.



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయమైన ఎస్‌ఎల్‌వీ థియేటర్ రహదారి ప్రయాణికుల అవస్థలు

పలకరించిన తొలకరి

కోవెలకుంట్ల: ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశించడంతో తొలకరి వర్షం పలకరించింది. సోమవారం కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం మేఘావృతమై కారుమబ్బులతో సబ్ కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, అవుకు మండలాల్లో వర్షం పడింది. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో భారీ వర్షం కురిసింది. పట్టణంలోని పలు కాలనీలకు వెళ్లే రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వర్షపునీరు చేరడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. మరో ఐదు రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు వర్షాలు అనుకూలంగా మారడంతో రైతులు ఊరట చెందుతున్నారు. విత్తనానికి ముందే సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది ఖరీఫ్ అన్ని విధాలా కలిసి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నైరుతి ప్రభావంతో వర్షం

కొలిమిగుండ్ల: నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. సోమవారం ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. సాయంత్రం నుంచి చిరుజల్లులతో మొదలై మోస్తరు వర్షం కురిసింది. ఉష్ణోగ్రతలు పూర్తిగా తగ్గి చల్లటి వాతావరణం ఏర్పడింది. నైరుతి రుతుపవనాలు వారం ముందుగానే ప్రవేశించడంతో వరుణుడు వర్షించాడు. ఈఏడాదైనా భారీ వర్షాలు కురిసి చెరువులు నిండి భూగర్భ జలాలు పెరగాలని రైతులు ఆశిస్తున్నారు.



కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

అనాథ మృతదేహం బంధువులకు అప్పగింత



బంధువుల ఇంటికి చేరుస్తున్న సమితి సభ్యులు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించడంతో పట్టణ పోలీసులు అనాథ మృతదేహంగా భావించి అంత్యక్రియలు నిర్వహించడానికి ద్రోణాచలం సేవా సమితి సభ్యులను కోరారు. వారు ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో బంధువులు గుర్తుపట్టడంతో అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని త్రివర్ణ కాలనీకి చెందిన యూసఫ్(68) అనారోగ్య కారణంగా స్థానిక వందపడకల ప్రభుత్వ పరిసరాల్లో మృతి చెందాడు. ఇది గమనించిన ఆస్పత్రి సిబ్బంది పోలీసు అవుట్ పోస్టెట్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అనాథ మృతదేహంగా భావించారు. అయితే పట్టణానికి చెందిన కొందరు ఆస్పత్రికి వచ్చిన సమయంలో శవాన్ని గుర్తుపట్టి మృతుని సోదరి రజియాకు సమాచారం ఇచ్చారు. ఆమె హుటాహుటిన అక్కడికి వెళ్లింది. తన సోదరుడికి భార్య, పిల్లలు లేరని తెలిపింది. పోలీసులు మృతదేహాన్ని తీసుకెళ్లాలని చెప్పడంతో ఉన్న ఫలంగా ఎలా తీసుకెళ్లాలో అర్థంకాని పరిస్థితిలో ద్రోణాచలం సేవా సమితి సభ్యులను సహాయం కోరింది. స్పందించిన సభ్యులు మృతదేహాన్ని రజియా ఇంటి వద్దకు చేర్చారు. ద్రోణాచలం సేవా సమితి సభ్యులు షాదిఖానా రాజా, గురుస్వామి, తాహెర్‌బాషా, ఆటో మధు, అల్తాఫ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆఖరి సమయంలో గుర్తుపట్టడంతో చివరి మజిలీలో బంధువులు చూడడానికి అవకాశం లభించింది.

పరామర్శ



మన్మథరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్: అనారోగ్యంతో శాంతిరామ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యాగంటిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బండి బ్రహ్మానందరెడ్డి తమ్ముడు బండి మన్మథరెడ్డిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. సోమవారం పాణ్యంలోని వైద్యశాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పాణ్యం బుజ్జి అమ్మను కూడా పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి రవికుమార్‌రెడ్డి ఉన్నారు.

- వైఎస్సార్‌సీపీ స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన అవుకుకు చెందిన కునుకుంట్ల రామన్న సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బనగానపల్లెలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. తనకు పదవి రావడానికి సహకారం అందించంతో కాటసానికి కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో టీకాలు వేయించాలి

అవుకు: పాడి రైతులు పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని పశువైద్యాధికారిణి భారతీదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఆమె మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాడి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. తొలకరి వర్షాలు కురుస్తున్నందున పశువులకు గొంతువాపు వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. పశువులకు 106 డిగ్రీ ఫారన్ హీట్, గురకపెట్టడం, నోట్లో నుంచి సొంగ కారడం, కళ్లు, ముక్కుల నుంచి నీటి లాంటి ద్రవాలు రావడం లాంటి లక్షణాలు ఉంటే గొంతువాపు వ్యాధిగా నిర్ధారించుకోవచ్చని తెలిపారు. వెంటనే దగ్గరలోని పశువైద్యులను సంప్రదిస్తే పశువులను రక్షించుకోవచ్చన్నారు. ప్రస్తుతం అవుకు మండలంలో గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నామని.. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడి ఎన్నిక

డోన్ టౌన్: మహర్షి వాల్మీకి బోయ సంఘం ఆంధ్రప్రదేశ్ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన హెచ్.కె నాయుడు ఇంద్రను ఎన్నుకున్నారు. స్థానిక ఎస్కేపీ హైస్కూల్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మహేష్‌కుమార్, కార్యదర్శి జక్కల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన్ను నియమించారు.

సోమవారం పులువురు ఆయనకు అభినందనలు తెలిపారు. వాల్మీకుల సమస్యల పరిష్కారంతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

స్తంభం ఒరిగింది.. ప్రమాదం పొంచివుంది



సంజామల ప్రభుత్వ పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



ముదిగేడు-సంజామల రోడ్డుపై అడ్డంగా విద్యుత్ స్తంభాలు

సంజామల: మండలంలోని పలు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. సంజామల ఉన్నత పాఠశాల సమీపంలో స్తంభం ఓ వైపు పూర్తిగా వాలిపోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. సంజామల–ముదిగేడు ప్రధాన రోడ్డులోనూ అదే పరిస్థితి. అసలే ఈదురు గాలులు వీచే సమయం. స్తంభం కింద పడితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముదిగేడు–సంజామల ప్రధాన రోడ్డు పనులు జరుగుతున్నాయి. ముదిగేడు వద్ద రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు రోడ్డు మీదనే ఉంచి అలానే పనులు కొనసాగిస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

వందేళ్ల భవనం.. చెక్కుచెదరని నిర్మాణం



బేతంచెర్లలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనం

బేతంచెర్ల: ఏదైనా భవనం నిర్మిస్తే 10 లేదా 15 ఏళ్లకు గోడలు పగళ్లు రావడం సహజం. అలాంటిది బేతంచెర్లలో 100 ఏళ్లు అయినా ఓ ప్రభుత్వ భవనం చెక్కుచెదరకుండా ఉంది. స్థానిక అంగళ్ల బజారులో స్వాతంత్ర్యం రాక మునుపు బ్రిటీష్ హయాంలో పెంకులు, కలపతో నిర్మించిన ఈ భవనం 1999 వరకు పోలీస్‌స్టేషన్‌గా కొనసాగింది. 1999 సంవత్సరంలో పోలీస్‌స్టేషన్‌కు రైల్వే స్టేషన్ ఎదురుగా నూతన భవనం నిర్మించడంతో అక్కడకు తరలించారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయంగా 2014 వరకు కొనసాగింది. 2014లో నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం మార్పు చేశారు. దీంతో కొంత కాలం పాటు గ్రామ రెవెన్యూ కార్యాలయంగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడంతో ఇక్కడ 3వ సచివాలయం ఏర్పాటు చేశారు. 2023లో డ్రైవర్స్ కాలనీలో గ్రామ సచివాలయ భవనం నిర్మించడంతో తదనంతరం సహకార పరపతి సంఘం కార్యాలయంగా మార్పు చేశారు. ఇలా అనేక ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలకు ఆశ్రయం కల్పించి ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని నిరూపించింది.

29 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రామిరెడ్డి, నిర్వాహకులు

బనగానపల్లె: మండలంలోని పలుకూరు వడ్డేపేట కాలనీలో ఈ నెల 29, 30, 31వ తేదీల్లో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయ నివాసంలో ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, ఆలయ కమిటీ, వడ్డెర సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నిర్మాణం పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంక్, బైక్‌పై బిందెలతో నీళ్లు తీసుకెళుతున్న యువకుడు, ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

అంకిరెడ్డిపల్లెలో తాగునీటి సమస్య

కొలిమిగుండ్ల: మండలంలోనే పెద్ద గ్రామం అంకిరెడ్డిపల్లె. జనాభాకు తగ్గట్టుగా నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతున్నా చాలా కాలనీల ప్రజలు అవస్థలు పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కొద్ది రోజులుగా తాగునీటి సమస్య జఠిలంగా మారింది. పలు కాలనీలకు నీటి సరఫరా అందకపోవడంతో బైక్‌లలో బిందెలతో నీళ్లు తీసుకుపోతున్నారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉన్నా నీటి సరఫరా అన్ని కాలనీలకు జరగడం లేదు. గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం కింద గీతాశ్రమం సమీపంలో అదనంగా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించింది. ట్యాంక్ పనులు పూర్తయ్యాయి. పైపులైన్ మాత్రమే పెండింగ్‌లో ఉంది. అధికారులు స్పందించి కొత్తగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ టెస్ట్

బనగానపల్లె రూరల్: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీ డీఎస్సీ–2025 అభ్యర్థుల కోసం మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంపుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు దస్తగిరి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 94945 91751, 89195 59736 నంబర్లకు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
70750 09103 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com